క్లుప్తంగా

గిరిజనుల భూములకు రక్షణ కల్పించండి..


మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామంలోని కబ్జాకు గురైన గిరిజనుల భూములను రెవెన్యూ అధికారులు రక్షించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్, గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం వారు ఆ భూములను సందర్శించి మాట్లాడారు. గిరిజనేతరలు గిరిజనులకు చెందిన భూములను కబ్జా చేస్తూ.. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పార్టీల అండదండలతో 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కేశవ్‌నాయక్, కుశనాయక్, భద్రం, శ్రీనివాస్, సాగర్, జగన్ పాల్గొన్నారు.

గ్రామీణులకు వైద్యం అందించడంలో విఫలం


మాట్లాడుతున్న ఎర్రా కామేశ్

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించడంలో పాలకులు విఫలమయ్యారని కొత్తగూడెం బీఎస్పీ అభ్యర్థి ఎర్రా కామేశ్ విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్ మాట్లాడుతూ ఉల్వనూరులో ఆరోగ్య కేంద్రం ఉన్నా గిరిజనులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడంలేదన్నారు. పగటి పూట మాత్రమే వైద్యం అందుతుండగా, అంబులెన్స్ లేదని, రాత్రయితే ఆందోళన చెందాల్సి వస్తోందని తెలిపారు. బీఎస్పీ నాయకులు వసుంధర, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కేతిని కుమారి, యర్రంశెట్టి రాజేశ్వరి, వెంకన్న, వర్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యం

ఇల్లెందు: బీఎస్పీ అధికారంలోకి వస్తేనే బహుజనుల రాజ్యం ఏర్పాటవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ తెలిపారు. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలోని సమ్మక్క గద్దెల వద్ద బీఎస్పీ నాయకుడు బాదావత్ ప్రతాప్‌తో కలిసి బుధవారం ఆయన పూజలు చేశాక ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. బహుజనులు తమ ఓటు సరైన నేతలకు వేయడం ద్వారా తలరాత మార్చుకోవచ్చని తెలిపారు. నాయకులు కేవీ రమణ, బండి రమణి, సీహెచ్ శ్రీనివాసరావు, కాంతారావు, రాయల శ్రీనివాసరావు, గోపీనాథ్, సత్యనారాయణ, సింగారం, మహేందర్, వినోద్, రమేశ్, వంశీ, కిషన్, సరోజ, అరుణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25 శాతం సీట్లివ్వాలి


లేఖను ప్రదర్శిస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

ఇల్లెందురూరల్: విద్యాహక్కు చట్టానికి లోబడి ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లివ్వాలని కోరుతూ మహాశక్తి ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం లేఖ పంపింది. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మాలోత్ దిలీప్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో 2009లోనే విద్యాహక్కు చట్టం రూపొందించారని, 2010 ఏప్రిల్ 1వ తేదీన అమలులోకి వచ్చిందన్నారు. కానీ, దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నారని, ఏపీలో ఈ చట్టం అమలవుతున్నా తెలంగాణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్‌పాసి, మహేశ్‌కోరి, ఉండం రమేశ్, ఈసం అజయ్, పూనెమ్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల కమిటీ ఎన్నిక

జూలూరుపాడు: మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని బుధవారం జూలూరుపాడులో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.కబీర్ దాస్, కార్యదర్శిగా ఎస్.సుభాకర్, ఉపాధ్యక్షుడిగా ఎం.కిరణ్‌నాయక్, కోశాధికారిగా పి.ఎబినేజర్, నిర్వహణ కార్యదర్శిగా నిరీక్షణకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్ ప్రకాష్, వి.ఎలీషా, వి.నతానియేలురాజ్, కె.జవహర్‌బాబు, పి.మహేశ్‌విక్టర్, బిషప్‌ఉదయ్‌సేతు, రాంచందర్‌పాల్ పాల్గొన్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో..?

- మండలంలో నత్తనడకన జీపీ భవనాల నిర్మాణం
- మూడు చోట్ల మొదలు.. ఎనిమిది చోట్ల ప్రారంభం కాని పనులు
- అద్దె భవనాల్లో ఇబ్బంది పడుతున్న పాలకవర్గాలు


గుండ్లరేవు గ్రామంలో పిల్లర్ల దశలో ఉన్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణం

జూలూరుపాడు: మండలంలో గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణం పూర్తయ్యేలా కనిపించడం లేదు. మండలంలోని 24కు గాను 13 గ్రామపంచాయతీలకు సొంత భవనాలున్నాయి. మిగతావి అద్దె భవనాలు.. అవీ ప్రభుత్వ పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ జీపీలకు కూడా నూతన భవనాల నిర్మాణం కోసం రూ.20 లక్షల చొప్పున ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్, ఐటీడీఏ నిధులు మంజూరు చేసింది. కానీ, అధికారులో నిర్లక్ష్యమో.. పాలకవర్గాల అలసత్వమో తెలియదు కానీ, పనుల్లో ఎడతెగని జాప్యం జరుగుతుండటంతో ఎప్పటికీ పూర్తవుతాయో తెలియడం లేదు.

ఎక్కడెక్కడ అంటే..

మండలంలోని కొత్తూరు, గుండ్లరేవు, భోజ్యాతండా, సూరారం, శంభునిగూడెం, గాంధీనగర్ జీపీ భవనాలకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, చింతల తండా, నల్లబండబోడు, సాయిరాంతండా, వెంగన్నపాలెం, గురువాగుతండా జీపీ భవనాలకు ఐటీడీఏ నిధులు కేటాయించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ, ఐటీడీఏ నిధులకు సంబంధితశాఖ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. అయితే, నిధులు మంజూరై ఏడాది కావొస్తున్నా కొత్తూరు, గుండ్లరేవు, నల్లబండబోడుల్లో మాత్రం పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన చోట్ల గ్రామ పంచాయతీ భవనాల పనులు ప్రారంభమే కాలేదు. గురువాగుతండా, చింతలతండాల్లో ప్రభుత్వ స్థలం లేకపోగా, మిగతా చోట్ల రకరకాల సమస్యలు ఎదురవుతున్నాయి. ఇందులో గుండ్లరేవు జీపీ భవనానికి రైతు తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు సొంత స్థలాన్ని ఇవ్వడంతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. కొన్నిచోట్ల బిల్లులు ఆలస్యమవుతాయనే భావనతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో జీపీ భవనాలు ఇంకోఏడాది గడిచినా పూర్తయ్యేలా లేవు.

విధి నిర్వహణలో ఇక్కట్లు

జీపీలకు సొంత భవనాలు లేక.. అద్దె భవనాలు సరిపోక పాలకవర్గాలు, ఉద్యోగులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం 2018లో మరో 12 ఏర్పాటు చేసింది. నూతనంగా గ్రామపంచాయతీలుగా మారిన వెంగన్నపాలెం, సాయిరాంతండా, సూరారం, నల్లబండబోడు, గాంధీనగర్, శంభునిగూడెం, గురువాగుతండా, చింతలతండా, గుండ్లరేవు, అన్నారుపాడు, భోజ్యాతండా, కొత్తూరు కార్యకలాపాలు అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగుతున్నాయి. ఆయా చోట్ల కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాలకవర్గాలు, సిబ్బంది ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కనీసం తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కూడా లేకపోవడం.. సరైన వెలుతురు లేక పాలకవర్గ సమావేశాల నిర్వహణ భారంగా మారిందని చెబుతున్నారు.

భవన నిర్మాణాలు జరుగుతున్నాయి



కొత్తూరు, గుండ్లరేవు, నల్లబండబోడు గ్రామ పంచాయతీ భవనాల పనులు జరుగుతున్నాయి. వర్షాలు, భవనాలు కట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వంటి కారణాలతో పనులు కొంత ఆలస్యమైంది. మరో మూడు, నాలుగు నెలల్లో జీపీ భవనాల పనులు పూర్తవుతాయి.

–నాగేందర్, పంచాయతీరాజ్, ఏఈ, జూలూరుపాడు

పనులు పూర్తి చేసేందుకు కృషి



గురువాగుతండాలో ప్రభుత్వ స్థలం లేదు. ప్రస్తుతం నల్లబండబోడు, కొత్తూరు, గుండ్లరేవు భవనాల పనులు కొనసాగుతున్నాయి. శంభునిగూడెంలో ఫౌండేషన్ పనులు చేపట్టగా, భోజ్యాతండా, సూరారం, సాయిరాంతండాల్లో మార్కింగ్ ఇచ్చాం. మిగిలిన భవనాల పనులు ప్రారంభించేలా చేస్తాం.

–తోట తులసీరాం, ఎంపీఓ, జూలూరుపాడు

అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మిగా అమ్మవారు..


కొత్తగూడెంటౌన్: రామవరంలో అన్నపూర్ణాదేవిగా..


పాల్వంచ: మహాలక్ష్మి అలంకరణలో..


జూలూరుపాడు: వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీలో..


టేకులపల్లి: మహాలక్ష్మిఅవతారంలో అమ్మవారు..

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి, ప్రగతినగర్‌కాలనీలోని శివాలయాలు, రామవరంలోని 7న నంబర్‌బజార్, కొత్తగూడెం భజనమందిరం, శ్రీనగర్‌కాలనీ, ప్రగతినగర్, రుద్రంపూర్, గౌతంపూర్, త్రీఇంక్‌లైన్, చిట్టిరామవరం, బూడిదగడ్డబస్తీ, రైటర్‌బస్తీల్లోని ఆలయాలు, శ్రీమాతశక్తి పంచాయతన క్షేత్రం, సూపర్‌బజార్, గొల్లగూడెం, పాలకేంద్రం, రామవరంలోని వనందాస్‌గడ్డబస్తీ, పోస్టాఫీస్ ఏరియా, పాత కొత్తగూడెం, విద్యానగర్‌కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కాగా, గణేశ్ టెంపుల్‌లో ఆలయ ఈఓ సులోచన, ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి శంకర్‌బాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పాల్వంచలో..

పాల్వంచ: పట్టణంలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో బుధవారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. కార్యక్రమంలో గంగపురి దుర్గాప్రసాద్, అలువల సందీప్, క్రాంతికుమార్, నరిగే మధు, వినయ్, మహేశ్, యశ్వంత్, బూర్గుల మధుబాబు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మహాలక్ష్మీదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పాపకొల్లు ఉమాసోమలింగేశ్వర, కోటమైసమ్మతల్లి ఆలయాలతోపాటు పలు గ్రామాల్లోని మండపాలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: టేకులపల్లిలోని రామాలయం, బోడు, రామచంద్రునిపేట, కోయగూడెం, కోయగూడెం ఓపెన్‌కాస్టు గ్రామాల్లో మండపాల అమ్మవారిని బుధవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

కలిసేందుకు వెళ్తే కండువా కప్పారు..

ఇల్లెందు: మొదటి నుంచి తనతో కొనసాగుతున్న కార్యకర్తల అభీష్టం మేరకు రాజకీయ పయనం ఉంటుందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ తెలిపారు. ఇల్లెందులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో దసరా ఉత్సవాలను మైసూర్ తరహాలో నిర్వహించాలని భావించి మంత్రి కేటీఆర్, ఎంపీ కవితను కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు తన మెడలో గులాబీ కండువా వేయగా, రాజకీయ ప్రవేశం చేసినట్లు ప్రచారం సాగిందన్నారు. త్వరలోనే కార్యకర్తలతో చర్చించి నిర్ణయం ప్రకటిస్తానని తెలిపారు. సమావేశంలో తుల్సిరాంగౌడ్, కమల్‌కోరీ, మేకల మల్లేశ్ యాదవ్, గుండంపల్లి సతీశ్, సీహెచ్ రమేశ్, స్వామీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల పంపిణీ

టేకులపల్లి: బోదకాలు వ్యాధిగ్రస్తులు క్రమంతప్పకుండా ప్రభుత్వం అందించే వైద్య సేవలను పొందాలని మండల వైద్యాధికారి కందుల దినేశ్ సూచించారు. డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష ఆదేశానుసారం మండలంలోని 28 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులకు స్థానిక సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఇప్పటికీ ప్రపంచంలో అత్యధిక మరణాలు కేవలం ఒక చిన్న దోమ కాటు వల్ల మాత్రమే సంభవిస్తున్నాయని, కాబట్టి దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, హరికృష్ణ, నాగుబండి వెంకటేశ్వర్లు, గుజ్జ విజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐదోరోజు వైభవంగా బతుకమ్మ వేడుకలు


సింగరేణి (కొత్తగూడెం): హెడ్డాఫీస్‌లో..


కొత్తగూడెంఅర్బన్: ప్రియదర్శిని కళాశాలలో..


పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో..


టేకులపల్లి: బస్టాండ్‌సెంటర్‌లో..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయ ఆవరణలో అన్ని విభాగాల మహిళా అధికారులు, ఉద్యోగులు సంబురాలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్‌లు (ఈఅండ్‌ఎం), సత్యనారాయణరావు, జీఎంలు (వెల్ఫేర్ అండ్ ఆర్సీ), (పర్సనల్–ఈఈ సెల్) కట్టా బసవయ్య కవితానాయుడు హాజరై మాట్లాడారు. అనంతరం అందంగా పేర్చిన బతుకమ్మలను ఎంపిక చేసి మహిళలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఎంఓ పి.సుజాత, ఏజీఎం (పర్సనల్) కె.శ్రీనివాసరావుతోపాటు నారాయణరావు, సునీల, ముకుంద సత్యనారాయణ, సుశీల్‌కుమార్, కె.శివకుమార్, జీకే కిరణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రియదర్శినిలో బతుకమ్మ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కళాశాలలో చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎస్‌ఐ రమాదేవి హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌కే నయీమ్‌పాషా, వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కొమ్మల్ల రమేశ్ పాల్గొన్నారు. కొత్తగూడెంలోని జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, బండి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలో బతుకమ్మ సంబురాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 5, 6, 7 దశల కర్మాగారంలో ఉద్యోగులు, కార్మికులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, ఎస్‌ఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: టేకులపల్లి బస్టాండ్‌సెంటర్, బొమ్మనపల్లి గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే హరిప్రియ పాల్గొని మహిళలతో కలిసి ఆడిపాడారు.

కాంగ్రెస్ పాలనలోనే న్యాయం


ఆరు గ్యారెంటీలను వివరిస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని, మళ్లీ అధికారంలోకి వస్తే మెరుగైన పాలన అందిస్తామని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తెలిపారు. మండలంలోని బొజ్జాయిగూడెంలో బుధవారం నిర్వహించిన గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ గతంలో ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని విమర్శించారు. తమ పార్టీని గెలిపిస్తే వంద రోజుల్లోగా హామీలు అమలుచేస్తామని తెలిపారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పులి సైదులు, అరెం కిరణ్, నాయకులు ఎట్టి హరికృష్ణ, పాయం స్వాతి, కల్తి పద్మ, పాయం లలిత, తాటి చుక్కమ్మ, మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, ముక్తి కృష్ణ, తాటి బిక్షం, ఆముదాల శ్రీనివాస్, పాయం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన వారికే టికెట్ ఇవ్వాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లెందు: ఆది నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేసి, జెండా మోసిన వారికే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని ఆశావహ అభ్యర్థులు కోరారు. అలాకాకుండా పారాచూట్ అభ్యర్థులకు టికెట్ ఇస్తే నష్టం ఎదురవుతుందని పేర్కొన్నారు. ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో భూక్యా దళ్‌సింగ్‌నాయక్, డాక్టర్ బి.రాంచందర్‌నాయక్, కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్‌నాయక్, ఆరెం పాపారావు, భూక్యా స్రవంతి, అజ్మీరా శంకర్‌నాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ రవి తదితరులు మాట్లాడారు. అభ్యర్థి ఎంపికకు సర్వే చేస్తున్నట్లు తెలియగా, అందులో తమ పేర్లు లేవని చెప్పడం సరికాదన్నారు. మాజీ ఎంపీ పొంగులేటి తనకు నచ్చిన అభ్యర్థుల పేర్లతో సర్వే చేయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌లో టికెట్లు అమ్ముకుంటున్నారనే ప్రచారం నేపథ్యాన తమకు అన్యాయం చేయొద్దని వారు కోరారు.

గోలియాతండాలో గడపగడపకూ కాంగ్రెస్


కరపత్రాలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రజలు పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధమయ్యారని ఆ పార్టీ నాయకురాలు భూక్యా స్రవంతి తెలిపారు. మండలంలోని గోలియాతండాలో సేవాలాల్ ఆలయంలో బుధవారం పూజలు చేసిన ఆమె గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ గ్యారంటీలను వివరించారు. అనంతరం స్రవంతి మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లుగా పార్టీలో ఉన్న తనకు మహిళా కోటాలో ఇల్లెందు టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, అధిష్టానం టికెట్ ఎవరికిచ్చినా గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అక్కిరాజు గణేశ్, బోడ రాంచందర్‌నాయక్, భూక్యా ధర్మానాయక్, ఇస్లావత్ నామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం)/పాల్వంచ: కొత్తగూడెం నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి పోటీ చేయనున్న నేపథ్యాన విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా కోరారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంతో పాటు పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గతం కంటే ప్రజాదరణ పెరిగిన నేపథ్యాన పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రజాసంక్షేమ పథకాల అమలులో విఫలమైన కేసీఆర్ విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, జిడ్డు నగేశ్, వంగా వెంకట్, భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణచారి, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, ముత్యాల విశ్వనాథం, వేములపల్లి శ్రీను, ఇరుకులపాటి సుధాకర్, గోపి, చేరాలు, రామయ్య, నాగమళ్ల సత్యనారాయణ, ఎండీ పాషా, జకరయ్య, సంఘమిత్ర, ఈశ్వరమ్మ, లక్ష్మి, మేరమ్మ, బిక్కులాల్, శ్రీను, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

20న సింగరేణి కార్యాలయం ముట్టడి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికల కోడ్ పేరుతో లాభాల వాటా, బోనస్ చెల్లింపు నిలిపేసి సింగరేణి కార్మికులను పండుగ సంతోషానికి దూరం చేయడం గర్హనీయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు కార్యదర్శి మిరియాల రంగయ్య అన్నారు. కొత్తగూడెంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లాభాల వాటా చెల్లించే విషయంలో ప్రభుత్వం, సింగరేణి యజమాన్యం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. లాభాల వాటా, బోనస్ చెల్లించాలనే డిమాండ్‌తో ఈ నెల 20న సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి, 21న సింగరేణి వ్యాప్తంగా టోకెన్ సమ్మె చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జి.వీరస్వామి, వంగా వెంకట్, క్రిస్టోఫర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం మేరకే పార్టీ నిర్ణయం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంరూరల్: నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకే పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, నాయకులు గోపాల్‌రావు, ఆళ్ల మురళీ స్పష్టం చేశారు. బుధవారం వారు చుంచుపల్లి మండలంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు రెండుస్థానాలకు మాత్రమే అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేసిందని, మిగతా స్థానాల్లో ఇంకా ప్రకటించలేదని, కార్యకర్తలు సమన్వయం పాటించాలని కోరారు. సమావేశంలో పిచ్చిరెడ్డి, గంగాధర్, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల కమిటీ ఎన్నిక


నూతన కమిటీతో జిల్లా నాయకులు

టేకులపల్లి: మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కీసర సుధాకర్‌రెడ్డి, బల్లెం అనిల్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా ఆమెడ రవి (రమేశ్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అలవాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎ.దామోదర్, కోశాధికారిగా బి.రవికుమార్, కుటుంబ భరోసా సభ్యుడిగా పోతుగంటి సైదులు, జిల్లా సభ్యుడిగా యాసం రమేశ్, ప్రచార కార్యదర్శిగా పూజారి సంపత్ కుమార్ ఎన్నికయ్యారు. తొలుత ఇటీవల మృతి చెందిన ఫొటోగ్రాఫర్ భూక్యా లక్ష్మణ్‌నాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్, నాగేశ్వరరావు, సురేశ్, జోగా శ్రీకాంత్, శేషు, కిరణ్, రవీందర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.